

లింబూరు రైతు వేదికకు ఎడ్ల బండిపై వస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావు



ఎల్లారెడ్డిలో సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

- రైతులకు రుణవిముక్తి కల్పించిన ప్రభుత్వం
- మొదటి విడత కింద రూ.లక్షలోపు రుణాలు ఉన్నవారికి మాఫీ
- రుణమాఫీపై హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు
- జిల్లాకు రూ.233 కోట్లు విడుదల
- లబ్ధిదారుల రైతుల ఖాతాలో జమ
- 45,290 మంది రైతులకు రుణమాఫీ
- జిల్లా వ్యాప్తంగా సంబరాల్లో రైతులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు

అన్నదాతల్లో ఆనందం

కామారెడ్డి, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు పంట రుణాల మాఫీ పథకాన్ని ప్రభుత్వం గురువారం నుంచి ప్రారంభించింది. నెల రోజుల పాటు మూడు విడతలుగా రూ.2లక్షల వరకు పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేయనుంది. పంట రుణాల మాఫీకై సంవత్సరాల తరబడి వేచి చూస్తున్న రైతుల నిరీక్షణకు రేవంత్ సర్కార్ తెరదించింది. పంట రుణాలను మాఫీ చేస్తుండడంతో జిల్లా వ్యాప్తంగా అన్నదాతల్లో ఆనందం వెల్లువెరుస్తోంది. మొదటి విడత కింద రుణమాఫీ పథకంలో భాగంగా జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం రూ.233 కోట్లు విడుదల చేసింది. గురువారం నుంచి రైతుల ఖాతాలో రుణమాఫీ డబ్బులను జమ చేస్తోంది. ప్రభుత్వం రుణమాఫీ చేయడంతో జిల్లాలోని రైతు వేదికల వద్ద రైతులతో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాకు రూ.233 కోట్లు విడుదల

రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ పథకాన్ని అమలులోకి తీసుకువచ్చింది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడత కింద రైతు రుణమాఫీ కింద ప్రభుత్వం విడుదల చేసింది. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రుణమాఫీ నిధులను బ్యాంకులకు విడుదల చేశారు. ఇందులో భాగంగా కామారెడ్డి జిల్లాకు రుణమాఫీ పథకం కింద మొదటి విడతలో రూ.233.40 కోట్లు విడుదల చేశారు. మొదటి విడతలో జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 45,290 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. కామారెడ్డి నియోజకవర్గంలో 10,595 మంది రైతులకు గాను రూ.57.36 కోట్లు విడుదల చేయగా, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 14,700 మంది రైతులకు గాను రూ.73.64కోట్లు, జుక్కల్ నియోజకవర్గంలో 14,674 మంది రైతులకు గాను రూ.78.02 కోట్లు, బాన్సువాడ నియోజకవర్గంలో 17,639 మంది రైతులకు గాను రూ.87.30 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులు ఆయా లబ్ధిదారుల రైతుల ఖాతాలో జమ కానున్నాయి.

కుటుంబానికి రూ.2లక్షల మాఫీ

ప్రభుత్వం అందిస్తున్న రైతు రుణమాఫీలో ఒక్క కుటుంబానికి రూ.2లక్షలు వర్తించే విధంగా మూడు రోజుల కిందటే మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. కుటుంబాన్ని నిర్ధారించేందుకు రేషన్‌కార్డులు ప్రామాణికంగా తీసుకుంటున్నారు. రైతు కుటుంబాన్ని రేషన్‌కార్డు ద్వారా నిర్ధారించడంతో అయోమయ పరిస్థితి కనిపిస్తోంది. అయితే రేషన్‌కార్డు కుటుంబానికి గుర్తించేందుకేనని పట్టా పాస్‌బుక్ ద్వారానే రుణమాఫీ చేస్తారని ప్రభుత్వం ప్రకటించింది. షెడ్యూల్, వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, డీసీసీబీల నుంచి తీసుకున్న రుణాలకు మాఫీ వర్తించనుంది.

జిల్లా వ్యాప్తంగా సంబరాలు

రాష్ట్రప్రభుత్వం గురువారం నుంచి రైతు రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించడంతో జిల్లాలోని అన్ని మండలాల్లో రైతువేదికల వద్ద సంబరాలు జోరుగా సాగాయి. కామారెడ్డి నియోజకవర్గంలోని క్యాసంపల్లిలోని రైతువేదిక వద్ద నిర్వహించిన సంబరాల్లో ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, ఎంపీ సురేష్ షెట్కార్, కాంగ్రెస్ శ్రేణులు రైతు రుణమాఫీ లబ్ధిదారులతో సంబరాలు జరుపుకున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలోని దేశాయిపేటలో గల రైతువేదిక వద్ద నిర్వహించిన సంబరాల్లో స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో స్థానిక రైతువేదిక వద్ద నిర్వహించిన సంబరాల్లో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జుక్కల్ నియోజకవర్గంలో డోంగ్లి మండలంలోని లింబూర్ రైతువేదిక వద్ద నిర్వహించిన సంబరాల్లో స్థానిక ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు హాజరయ్యారు. ఎడ్లబండిపై ఎమ్మెల్యే స్థానికంగా ర్యాలీ నిర్వహించారు.

రూ.50 వేల రుణమాఫీ అయింది



• బాల్‌రాజ్, రైతు, సీతారాంపూర్

మొదటి విడతలో లోన్‌మాఫీ అయిందని వ్యవసాయ శాఖాధికారులు తెలిపారు. పంట సాగు కోసం గతంలో బ్యాంకుల్లో రూ.50వేల లోన్ తీసుకున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ లోన్‌ను మాఫీ చేయడం ఎంతో ఆనందంగా ఉంది. రుణమాఫీతో మాలాంటి వ్యవసాయం చేసుకునేవారికి ఎంతో మేలు చేకూరనుంది. లోన్ మాఫీ చేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు.

రుణమాఫీతో ఆనందంగా ఉంది



• సక్రునాయక్, శివపూర్‌తండా

నాకు 1.5 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. బ్యాంక్‌లో రూ.70వేల లోన్ తీసుకున్నాను. ప్రభుత్వం మాఫీ చేసిన రుణమాఫీతో నా ఖాతాలో రూ.70 వేలు పడ్డాయి. గత పది సంవత్సరాల క్రితం కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే రుణమాఫీ చేసింది. అసెంబ్లీ ఎన్నికల ముందు హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల రుణమాఫీ చేయడం వల్ల మా కుటుంబం ఆనందంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే రైతుల సంక్షేమ ప్రభుత్వమని రైతును ఆదుకునేది.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



• విజయ్‌కుమార్, లక్ష్మీదేవునిపల్లి

రైతు కష్టాన్ని గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి రైతుల రుణమాఫీ చేయడం సంతోషకరం. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులంతా రుణపడి ఉంటారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడతలో లక్ష రూపాయల వరకు రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. నా పేరు మీద ఉన్న పంట రుణం మాఫీ అయింది. సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.



కామారెడ్డి నుంచి బైక్‌ర్యాలీతో క్యాసంపల్లి రైతువేదికకు వెళ్తున్న షబ్బీర్‌అలీ



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

జిల్లాలో మోస్తరు వర్షం

కామారెడ్డి టౌన్/బాన్సువాడ టౌన్, జూలై 18: కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా గురువారం మోస్తరు వర్షం కురిసింది. గడిచిన 24 గంటల్లో జిలా వ్యాప్తంగా 41.4 మి.మీల వర్షపాతం నమోదైంది. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌లోని పలు మండలాల్లో సాధారణం నుంచి మోస్తరు వర్షం కురిసింది. కామారెడ్డి పట్టణ కేంద్రంలో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం పడడంతో ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. నస్రుల్లాబాద్‌లో 10.7, గాంధారిలో 4.1, తాడ్వాయి 4.6 మి.మీ., బీర్కూర్‌లో 8.1, మద్నూర్‌లో 1.4మి.మీ.ల వర్షపాతం నమోదైంది. ఈ వర్షాకాలం సీజన్‌లో గత వారం రోజులుగా మోస్తరు వర్షాలు మాత్రమే పడుతున్నాయే తప్ప భారీ వర్షాలు మాత్రం పడడం లేదు.

జిల్లాలో పంటల సాగులో రైతులు బిజీబిజీ

జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు రైతులు పంటల సాగులో నిమగ్నమయ్యారు. ఆరుతడి పంటలను రైతులు ఇప్పటికే సాగు చేస్తున్నారు. పత్తి, సోయా, మొక్కజొన్న, కందిలాంటి ఆరుతడి పంటలను సాగు చేసేందుకు రైతులు విత్తనాలు విత్తటమే కాకుండా కలుపుతీత ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పడుతున్న వర్షాలు ఆరుతడి పంటలకు ఎంతో మేలు చేకూరుస్తాయి. అయితే ఇప్పటికే మద్నూర్, జుక్కల్, బిచ్కుంద, పిట్లం, నస్రుల్లాబాద్, తాడ్వాయి, గాంధారి, సదాశివనగర్ తదితర మండలాల్లో సోయా, పత్తి, మొక్కజొన్న పంటలను సాగు చేయడంలో రైతులు నిమగ్నమయ్యారు. అదేవిధంగా జిల్లాలో ప్రధానంగా రైతులు వరి పంటను సాగు చేస్తుంటారు. వరి పంట సాగుకు దుక్కులు దున్ని నారుమళ్లను సిద్ధం చేస్తున్నారు. బాన్సువాడ, బిచ్కుంద, బీర్కూర్, నస్రుల్లాబాద్ తదితర మండలాల్లో వరి నాట్లు సైతం పడ్డాయి. బాన్సువాడ పట్టణంలో గురువారం సాయంత్రం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయింది. వానాకాలం ప్రారంభమైన తర్వాత వర్షం భారీగా కురవడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కామారెడ్డిలో కురుస్తున్న వర్షం

రేపు రాజంపేటలో సోషల్ ఆడిట్ ప్రజావేదిక

రాజంపేట, జూలై 18: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో భాగంగా నిర్వహించే సోషల్ ఆడిట్ ప్రజావేదిక శనివారం ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేశం తెలిపారు. మండలంలోని ఎంఎస్‌ఆర్‌ఈజీఎస్ కింద గత సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి ఈ సంవత్సరం మార్చి 31 వరకు గ్రామాల్లో నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీ జరుపుతున్నట్లు తెలిపారు. ఈ సామాజిక తనిఖీలో భాగంగా గ్రామ సోషల్ ఆడిటర్లు, డీఆర్‌పీలు, ఎస్‌ఆర్‌పీలు గురువారం వరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. సామాజిక తనిఖీ గ్రామాల్లో పూర్తయినందున మండల ప్రజావేదిక ఈనెల 20న ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు ఇతర సంబంధిత అధికారులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొనాలని తెలిపారు.



కలెక్టర్‌తో కలిసి సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న షబ్బీర్‌అలీ

కాంగ్రెస్ పార్టీ మాట తప్పదు.. మడమ తిప్పదు

ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, జూలై 18: కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే తప్పదని.. మడమ తిప్పదని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. గురువారం కామారెడ్డి మండలం క్యాసంపల్లి రైతువేదికలో సీఎం రేవంత్ రెడ్డి రుణమాఫీపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ వరంగల్‌లో జరిగిన రైతు డిక్లరేషన్ కార్యక్రమంలో ప్రకటించిన విధంగా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో మాట ఇచ్చిన విధంగా ఆగష్టు 15లోపు రుణమాఫీ మొత్తం చేస్తామన్నారు. ప్రస్తుతం గురువారం రూ.1లక్ష నుంచి రైతు రుణమాఫీ ప్రారంభించినట్లు తెలిపారు. రైతు రుణమాఫీపై ఆర్థిక నిపుణులు కష్టమవుతుందని ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పిన రైతుల కోసం ఏ కష్టానైన దీటుగా ఎదుర్కొంటామని ముందడుగు వేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే తప్ప దని ఆనాడు తెలంగాణ ఇస్తామని చెప్పి సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. తెలంగాణ ఏర్పాటు చేస్తే ఆంధ్రలో పార్టీకి నష్టమని తెలిసిన ఆనాడు సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. గాంధీ కుటుంబం మాట ఇస్తే అది శిలాశాసనం అని రాహుల్ గాంధీ మాట ఇచ్చారంటే అది చేసి తీరుతారన్న నమ్మకం ప్రజలకు చేరిపోయిందని అన్నారు. రాబోయే రోజుల్లో రాహుల్ ప్రధాని కావడం ఖాయమని అన్నారు. మొదటి విడతగా జిల్లాలో 235 కోట్ల 62లక్షల 46వేల 271 రూపాయలను రైతు ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గానికి రూ.57కోట్ల 36లక్షల 20 వేల 517 రైతుల ఖాతాల్లో జమ అయినట్లు తెలిపారు. ఈ నెల 25 నుంచి రూ.1లక్ష 50వేల వరకు, ఆగస్టు 1 నుంచి 15 వరకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తారని తెలిపారు. అంతకుముందు కామారెడ్డి రైల్వేస్టేషన్ నుంచి క్యాసంపల్లి రైతువేదిక వరకు స్వయంగా ద్విచక్ర వాహనం నడిపి షబ్బీర్‌అలీ కాంగ్రెస్ శ్రేణులతో చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి భాగ్యలక్ష్మీ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు రుణమాఫీ పూర్తి చేయాలి

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్, జూలై 18: అర్హులైన రైతులందరికీ పగడ్బందీగా రుణమాఫీ పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ షెడ్యూల్‌ను ప్రకటించిన నేపథ్యంలో గురువారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేయడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కుటుంబం యూనిట్‌గా తీసుకుని 12 డిసెంబరు 2018 నుంచి 9 డిసెంబరు 2023 వరకు పంట రుణాలు తీసుకున్న రైతులకు 3 విడతల్లో గరిష్టంగా 2 లక్షల రుపాయల వరకు పంట రుణమాఫీ చేయడానికి చర్యలు చేపట్టిందని తెలిపారు. మొదటి విడతలో గురువారం రూ.1లక్ష ఆ లోపు పంట రుణాలు మాఫీ చేసేందుకు బ్యాంకులకు, వ్యవసాయశాఖ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. మొదటి విడతగా జిల్లాలో 49,541 మంది రైతులకు 235 కోట్ల 61లక్షల రూపాయల రుణమాఫీ వర్తిస్తున్నందున ప్రతీ బ్యాంకులో రుణమాఫీకి ప్రత్యేక నోడల్ అధికారిని నియమించుకొని ఎలాంటి సమస్య తలెత్తకుండా సంబంధిత రైతులకు మాఫీ అయ్యేలా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పంట రుణాలకు మాత్రమే మాఫీ చేయాలని ఇతర రుణాలకు వర్తింపజేయరాదని బ్యాంకర్లను ఆదేశించారు. అర్హత ఉన్న వారికి ఎవరికైన పంట రుణాల మాఫీ జరగకుంటే జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ 7288894616 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మీ, ఎల్‌డీఎం రవికాంత్, బ్యాంక్ మేనేజర్‌లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కలెక్టర్‌ను కలిసిన కేంద్ర జలశక్తి అధికారులు

కేంద్ర జలశక్తి అధికారులు గురువారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను కలిశారు. గత 5 రోజులుగా జిల్లాలోని సదాశివనగర్, మాచారెడ్డి, భిక్కనూర్, దోమకొండ, లింగంపేట, నిజాంసాగర్ మండలాల్లో పర్యటించి చెరువులలో పూడికతీత, ఈత ప్లాంటేషన్, మల్టీలేయర్ ఎవెన్యూ ప్లాంటేషన్, మ్యాజిక్ సోక్ పీట్, కమ్యూనిటీ మ్యాజిక్ సోక్‌పీట్ మునిగా, డ్రాగన్ ఫ్రూట్ ప్లాంటేషన్, నర్సరీ, ఫామ్‌పాండ్, ఫిష్‌పాండ్, నాగన్నబావి, నిజాంసాగర్ డ్యాంలను పరిశీలించి జిల్లా వర్షం నీరు సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు ప్రభుత్వం తీసుకున్న చర్యలను పరిశీలించి కలెక్టర్‌తో పంచుకున్నారు. జిల్లాలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంతో పాటు ఇతర నిధులతో జిల్లాలో వాన నీటి సంరక్షణ, భూ గర్భజలాల పెంపకానికి జిల్లా వ్యాప్తంగా తీసుకున్న చర్యలు బాగున్నాయని, వీటి వల్ల జిల్లాలో నీటి వనరుల లభ్యత పెరుగుతుందని, ఆయా పనులలో మహిళల భాగస్వామ్యం బాగుందని కేంద్ర జలశక్తి అధికారి, కేంద్ర విద్యుత్‌శాఖ డిప్యూటీ సెక్రెటరీ బెంజిమన్ కరుణాకరన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ జూనియర్ సైంటిస్ట్ ఆదర్వ శ్రీకృష్ణపవార్, డీఆర్‌డీఏ పీడీ చందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితం నాశనం చేసుకోవద్దు : ఎస్సై

ముప్కాల్, జూలై 18 : విద్యార్థులు డ్రగ్స్ బారినపడి జీవితం నాశనం చేసుకోవద్దని బాల్కొండ ఎస్సై యాసిర్‌అర్ఫాత్ అన్నారు. గురువారం ప్రభుత్వజూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్‌కు బానిసై ఎందరో విద్యార్థుల జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. వ్యసానాలకు బానిస కావద్దన్నారు. డ్రగ్స్ వాడితే కలిగే నష్టాల గురించి వివరించారు.

విద్యార్థులు చదువులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

● ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న జానీరెడ్డి

మాక్లూర్, జూలై 18 : విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆర్టీసీ రిజినల్ మేనేజర్ జానీ రెడ్డి అన్నారు. గురువారం విజయ్‌రూరల్ ఇంజనీరింగ్ కళాశాలలో పాల్ టెక్నిక్ ఓరియంటల్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్లొమ చదివిన విద్యార్థులకు ఉన్నత అవకాశాలపై వివరించారు. అలాగే విద్యార్థులు ఈ వయస్సులో తీసుకోవాల్సిన జాగ్రత్త లను వివరించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గణేష్, అధ్యాపకులు స్వప్న, శ్రీకాంత్, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రైతులకు న్యాయం

● మాజీస్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ రూరల్, జూలై 18 : రైతులకు రుణమాఫీ చేయడం కాంగ్రెస్‌తోనే సాధ్యమైందని మాజీస్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం రైతులకు రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సంబరాల కార్యక్రమంలో బాన్సువాడ దేశాయిపేట్ గ్రామాల్లో నిర్వహించిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు రాష్ట్ర ఆగ్రోచైర్మన్ కాసుల బాల్ రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ చిత్రపటాలకు పాలాభిషేకం చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే పోచారం మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ఇది సాధ్యమైందన్నారు. నలభై లక్షల మంది రైతులకు ముప్పైఒక వేల కోట్ల రూపాయలు, రెండు లక్షల రూపాయల వరకు ఒకేసారి అందించడం భార తదేశంలో ఇదే ప్రథమమన్నారు. ఇలాంటిది ఎప్పుడు జరగలేదన్నారు. అం దుకే సంబురాలు చేసుకుంటున్నామన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధిష్ఠానం నిర్ణ యానికి అనుగుణంగా మన గౌరవ ముఖ్యమంత్రి మంత్రివర్గ సభ్యులు రుణమాఫీని అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి అనుమతితో నిజాం సాగర్ ప్రాజెక్టు నుంచి పంటల సాగుకు నీరువిడుదల చేయించాం. రాష్ట్రంలో కేవలం నిజాంసాగర్‌ప్రాజెక్టు కింద మాత్రమే వరినాట్లు వేశా రు. ఒకవేళ నీళ్ళు తగ్గితే నేను ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ ముఖ్య మంత్రి దగ్గరకు వెళ్లి కొండపోచమ్మ సాగర్ నుంచి నీటిని తెచ్చి పంటలను కాపాడుతాం. కాసుల బాల్‌రాజ్ రాష్ట్రస్థాయి పదవిలో ఉన్నారు. బయటి నుంచి వచ్చిన వారు కొన్నాళ్ళు ఉంటారు. తరువాత సర్దుకుని పోతారు. బాన్సువాడ నియోజకవర్గంలో రైతులకు, పేదలకు అండగా ఉండటానికి నేను బాలరాజు కలిసి పని చేస్తాం. బాన్సువాడ నియోజకవర్గానికి మంచి రోజులు వచ్చాయన్నారు. రుణమాఫీ అంశాన్ని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు చర్చకు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 15 నాటిని పూర్తిస్థాయి రుణమాఫీ ప్రక్రియ పూర్తి అవుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం, సోనియా, రాహుల్ గాంధీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

వర్ని : ఒకేసారి రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయడం దేశ చరిత్రలోనే గొప్పచారిత్రక అంశమని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు 29 రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి 41 లక్షల మందికి ఏకకాలంలో రుణమాఫీ చేసి రైతులను సంబరపర్చడం గర్వకారణంగా కొనియాడారు.

రుణమాఫీపై సంబరాలు


డొంకేశ్వర్‌లో ఎడ్లబండ్లపై ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

డొంకేశ్వర్, జూలై 18 : దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తుందని - తెలంగాణ రాష్ట్ర విత్త నాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి అన్నారు. గురువారం డొంకేశ్వర్ మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన రైతు రుణమాఫీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చ్చిన మాట ప్రకారమే కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసిందని వివరించారు.

ఏర్గట్ల : రైతులకు రుణమాఫీ చేయడంతో మండలంలోని కర్షకులు, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి, బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

నవీపేట : మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని జన్నెపల్లి రైతు వేదికలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని రైతులు వీడియో కాన్ఫరెన్స్‌లో వీక్షించారు. రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ విడుదల చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

రెంజల్ : మండల కేంద్రంలోని రైతువేదికలో సీఎం ప్రసంగాన్ని మండల రైతులు, కాంగ్రెస్ నాయకులు వీక్షించారు. ఇచ్చిన మాట ప్రకారం లక్ష రూపాయల రుణమాఫీ మొదటి విడతలో చేయడం అభినందనీయమని మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్ అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం టపాకాయలు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. బాగేపల్లిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

మోర్తాడ్ : మండల కేంద్రంలో జాతీయరహదారి నుంచి దళితవాడకు ఊరేగింపుగా తరలివెళ్లారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాలసునీల్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత జాతీయరహదారిపై భారీ ఎత్తున టపాకాయలు పేల్చారు. అనంతరం రైతు వేదిక భవనం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ముత్యాల సునీల్‌కుమార్ పాలాభిషేకం చేశారు.

ఆర్మూర్‌రూరల్ : ఆలూర్ మండల కేంద్రంలో రైతులు గురువారం రుణమాఫీ సంబరాలు నిర్వహించారు. మొదటి రోజు రూ.లక్ష రుణమాఫీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ టపాకాయలు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రైతులు పాలాభిషేకం చేశారు.

వేల్పూర్ : ప్రతీ రైతుకు రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేయడం చారిత్రాత్మక నిర్ణయమని డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి అన్నారు. గురువారం వేల్పూర్‌లోని రైతువేదికలో ఏర్పాటు చేసి రుణమాఫీ సంబరాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

మోస్రా : మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని వీక్షించారు. రైతురుణమాఫీపై వర్ని మండలంలోని వీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి ఏర్పాటు చేసిన సంబరాలు కార్యక్రమంలో పాల్గొనడానికి మోస్రా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు.

కోటగిరి : కోటగిరి, పొతంగల్ మండల కేంద్రాల్లో గురువారం రైతు రుణమాఫీ అమలు చేయడాన్ని స్వాగతిస్తూ సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీని సీఎం రేవంత్ రెడ్డి నెరవేర్చారని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకే తొలి ప్రాధాన్యత ఇస్తుందని గుర్తు చేశారు.

డిచ్‌పల్లి : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 6నెలల్లో నేరవేర్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని గత ప్రభుత్వం చేసిన కోట్లాది రూపాయల అప్పులు అధిగమించి రాష్ట్రంలో ఏకకాలంలో రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని మం డల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ అ న్నారు. మండలంలోని నడిపల్లి రైతు వేదిక వద్ద సీఎం రేవంత్, ఎమ్మెల్యే భూపతిరెడ్డి చిత్రపటాలకు పాలాభి షేకం చేసిన అనంతరం మాట్లాడారు.

నందిపేట : నిజామాబాద్ చౌరస్తాలోని వివేకానంద విగ్రహం నుంచి ఐలమ్మ, అంబేడ్కర్ చౌరస్తాల మీదుగా కొత్తబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. రూ.లక్ష వరకు ఉన్న రుణాలు మాఫీ చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

పెర్కిట్ : ఆర్మూర్ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు పెర్కిట్ నుంచి అంబేద్కర్‌చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించిన అనంతరం పెద్ద ఎత్తున టపాకాయలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ర్యాలీగా వెళ్ళి రైతు వేదిక భవనంలో సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన హామీ ప్రకారం రైతు రుణమాఫీ చేశామని తెలిపారు.

వేల్పూర్ : ప్రతీ రైతుకు రూ.2 లక్షల లోపు రుణమాఫీచేయడం చారిత్రాత్మక నిర్ణయమని డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి అన్నారు. గురువారం వేల్పూర్‌లోని రైతు వేదికలో ఏర్పాటు చేసి రుణమాఫీ సంబరాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు.

ఎడపల్లి : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం ఎడపల్లి రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేసి ఒకరినొకరు మిఠాయిలు పంచుకున్నారు.

రుద్రూరు : మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రెండు లక్షల రుణమాఫీలో భాగంగా మొదటి విడతగా లక్ష రూపాయల రుణమాఫీ చేసిన శుభ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.

జక్రాన్‌పల్లి : జక్రాన్‌పల్లి, అర్గుల్, పడకల్, కలిగోట్ గ్రామాల్లో రైతువేదికలో సీఎం రేవంత్‌రెడ్డి, నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

కమ్మర్‌పల్లి : మండలంలో 1270 మంది రైతులకు రుణమాఫీ వర్తించినట్లు వ్యవసాయధికారి అబ్దుల్ మలిక్ తెలిపారు. రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో కలిసి సీఎం సందేశాన్ని వీక్షించారు.

ముప్కాల్ : ముప్కాల్, బాల్కొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించడంతో కాంగ్రెస్ శ్రేణులు, రైతులు సంబరాలు నిర్వహించారు.

వేతనాలు చెల్లించాలని ధర్నా



నిరసన తెలుపుతున్న లిఫ్టు కార్మికులు

నవీపేట, జూలై 18 : జిల్లాలోని అలీసాగర్, గుత్ప ఎత్తిపోతల పథకంలో పనిచేస్తున్న తమకు నాలుగు మాసాలుగా వేతనాలు చెల్లించడం లేదని, వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. అలీసాగర్, గుత్పఎత్తిపోతల పథకంలో తాము ఎలక్ట్రిషియన్, పంప్‌ఆపరేటర్, వాచ్‌మెన్, తదితర పనులను సుమారు 120 మంది వరకు చేపడుతున్నామని అన్నారు. నాలుగు మాసాలుగా సంబంధిత కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు తమ ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ ప్రధాన చౌరస్తా వద్ద నిరసన తెలిపి, మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ నారాయణకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో గణేష్, కార్తీక్, సందీప్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

కుర్నాపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

ఎడపల్లి, జూలై 18 : కుర్నాపల్లి గ్రామ శివారు పంటపొలంలో ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్లను బుధవారం రాత్రి దుండగులు ధ్వంసం చేసి, అందులో ఉన్న రాగి వైరు కాయిల్స్‌ను ఎత్తుకెళ్ళారని రైతులు తెలిపారు. గతంలో కూడా ఇదే ఏరియాలో ధ్వంసం చేశారన్నారు. కొందరు కావాలనే ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తూ అందులోని రాగివైరును ఎత్తుకెళ్ళి పంట పొలాలకు నష్టం కలుగజేస్తున్నారని వారు వాపోయారు. పోలీసులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం కాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

వర్సిటీ అధ్యాపకుల రిటైర్‌మెంట్ వయస్సు 65కు పెంచాలి

డిచ్‌పల్లి, జూలై 18 : దశాబ్దకాలం పాటు ప్రభుత్వరంగ విద్యాసంసల పట్ల నిర్లక్ష్యం చేస్తూ ఉన్నత విద్యను నిర్వీర్యం చేశారని తెలంగాణ యూనివర్సిటీ టూటా అధ్యక్షుడు డా.పున్నయ్య పేర్కొన్నారు. గురువారం వర్సిటీలో జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మానవవనరుల అభివృద్ధి రాష్ట్ర అభివృద్ధిలో కీలకంగా ఉంటుందన్నారు. ఈ ప్రభుత్వం ఉన్నత విద్యారంగంలో పనిచేస్తున్న అధ్యాపకులకు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ నిబంధనల మేరకు పదవి విరమణ 65ఏళ్లకు పెంచాలని వర్సిటీలోని ఖాళీఉద్యోగాలను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అలీసాగర్ లిఫ్టులో పాములు


పంప్‌లో బయటపడ్డ రక్తపింజరాలు

నవీపేట, జూలై 18 : మండలంలోని కోస్లీలో గల అలీసాగర్ ఎత్తిపోతల పథకం స్టేజీ-1 పంప్ హౌస్‌లో ఒకేరోజు 20 రక్త పింజర పాములు బయట పడినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కార్మికులు తెలిపిన ప్రకారం ఈ నెల 11న ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు 20 రక్త పింజరాలు బయటపడ్డాయని, ఇందులో కొన్నింటిని తాము చంపి వేయగా మరికొన్ని బయటకు పారిపోయాయని వారు పేర్కొన్నారు. కొన్నిసార్లు మిషనరీకి చెందిన సందులలో నక్కి ఉంటున్నాయని, తాము అప్రమత్తంగా లేకపోతే వాటి కాటుకు గురికావాల్సిన ప్రమాదం ఉంటుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులుగా పనిచేస్తున్న తమకు గత కొన్ని సంవత్సరాలుగా రక్షణ పరికరాలు ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తమ రక్షణకు బూట్లు, చేతి గ్లౌసులు, టోపీలు అందించాలని కోరుతున్నారు.

డిగ్రీ ఫలితాలు విడుదల

డిచ్‌పల్లి, జూలై 18 : తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని 2021-24 సంవత్సరం డిగ్రీఫలితాలు విడుదల చేశారు. వర్సిటీ వీసీ సందీప్ కుమార్ సుల్తానియ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి తన చాంబర్‌లో కంట్రోలర్ అరుణతో కలిసి ఫలితాలు విడుదల చేశారు. 8930 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 3966 ఉత్తీర్ణులు అయ్యారు. 44.41శాతం ఉత్తీర్ణులు అయ్యారని, ఇందులో బాలురు 27.93శాతం, బాలికలు 55.66 శాతం ఉత్తీర్ణత సాధించారని సీవోఈ అరుణ తెలిపారు. విడుదల కార్యక్రమంలో ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్, సాయిలు, డా.నం దిని, డా.శాంతబాయి, పీఆర్వో పున్నయ్య, ప్రోగ్రామర్‌లు సతీశ్, విజయ్, సందీప్ పాల్గొన్నారు. డిగ్రీ బ్యాక్‌లాగ్ వన్‌టైం పరీక్షలు గురువారం 16వరోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు. తొమ్మిది మంది గైర్హాజరయ్యారని చంద్రశేఖర్ తెలిపారు.

ఉత్తీర్ణతా శాతం పెంచండి : బోధన్ ఎమ్మెల్యే


చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

ఎడపల్లి, జూలై 18 : మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం 75కు పైగా రావాలని మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 41 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అందించారు. ఆ తరువాత మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి పాఠశాలలో ఉన్న సమస్యలు, విద్యార్థులు, ఉపాధ్యాయుల వివ రాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం పెంచాలని, అలాగే విద్యార్థుల ఉత్తీర్ణత శాతం ప్రతీ సబ్జెక్టులో 75కు పైగా వచ్చేలా చూడాల్సిన బాధ్యత పాఠశాలల ప్రధానోపాధ్యాయులదేనన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బీన్ హందాన్, బోధన్ ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్, తహసీల్దార్ ధన్వాల్, ఎంపీడీవో శంకర్‌నాయక్, నాయకులు శంకర్‌నాయుడు, పులిశ్రీనివాస్, బిల్లా రాంమోహన్, రజితాయాదవ్, ఎల్లయ్య యాద వ్, బంజకామప్ప, అమానుల్లా, ఖాజా, గంగాప్రసాద్, నారాయణ, రవీందర్‌రెడ్డి, కంచరి శ్రీనివాస్, బొబ్బిలి శ్రీనివాస్ ఉన్నారు.

ఆడపడుచులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

బోధన్‌రూరల్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి దేశ చరిత్రలో నిలిచిపోయిందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి ఖజానాను ఖాళీ చేశాయని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై మండిపడ్డారు. బోధన్ పట్టణంలోని అప్నా ఫంక్షన్‌హాల్‌లో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ బోధన్ నియోకవర్గంలో 500మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్; కాంగ్రెస్ పార్టీ నాయకులు పాషామొయినోద్దీన్, ఆదినారాయణ, బిల్ల రామ్మోహన్, పులిశ్రీనివాస్, నాగేశ్వర్ రావు, మందర్నా రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును వాడుకలోకి తెస్తాం : ఎస్‌బీఎం డైరెక్టర్


మొక్కలు నాటిన ఎస్‌బీఎం డైరెక్టర్ సురేష్ బాబు

ఎడపల్లి, జూలై 18 : తెలంగాణ రాష్ట్రంలోనే నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలో సుమారు కోటి రూపాయల వరకు విలువ చేసే మోడ్రన్ డంపింగ్ యార్డును త్వరలో వాడుకలోకి తెస్తామని స్వచ్ఛ భారత్‌మిషన్ డైరెక్టర్ సురేష్‌బాబు తెలిపారు. ఎడపల్లి మండల కేంద్రంలో రూర్బన్ పథకంలో భాగంగా నిర్మించిన మాడ్రన్ డంపింగ్ యార్డును గురువారం జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించి డంపింగ్ యార్డు ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం మాడ్రన్ డంపింగ్ యార్డులో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ప్రెస్సింగ్ యంత్రాల పనితీరును ఆయన పరిశీలించి, యంత్రాలలో ఏమైనా సమస్యలుంటే వాటిని వెంటనే సరిచేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటగా ఎడపల్లి మండలంలోని గ్రామాలలోని ప్లాస్టిక్‌ను మోడ్రన్ డంపింగ్ యార్డుకు తరలించేలా చర్యలు చేపడతామని, ఆ తరువాత రెంజల్, నవీపేట, బోధన్ మండలాల ప్లాస్టిక్ వ్యర్థాలను మోడ్రన్ డంపింగ్ యార్డుకు తరలించే విధంగా అనుసంధానం చేస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్, డీఎల్‌పీఓ సాయిబాబా, ఎంపీడీవో శంకర్‌నాయక్, ఎంపీవో రవిప్రకాష్ రెడ్డి, ఉపాధిహామీ ఏపీవో శ్రీవాణీ, ఐకేపీ ఏపీఎం సాయిలు, ఎడపల్లి పంచాయతీ కార్యదర్శి నాగరాజు గౌడ్, ఉపాధి హామీ క్షేత్ర సహాయకురాలు సుచరిత తదితరులు ఉన్నారు.

అక్రమ కోకాల తొలగింపు


కోకాలను తొలగిస్తున్న సిబ్బంది

బోధన్ రూరల్, జూలై 18 : బోధన్ ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఉన్న అక్రమ కోకాలను గురువారం తెల్లవారుజామున ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు తొలగించారు. జేసీబీతో అక్రమ కోకాలను తీసివేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ విజిలెన్స్ సీఐ జనార్దన్ మాట్లాడుతూ బోధన్ ఆర్టీసీ స్థలం అక్రమించిన వారికి కోర్టు నోటీసులు పంపించామని, అయినా వినకపోవడంతో కోర్టు ఆదేశాలతో చట్టప్రకారమే తొలగించామన్నారు. 20 సంవత్సరాలుగా కోకాలు వేసుకుని తీయకపోవడంతో కోర్టు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోకాను తీసివేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఆర్టీసీ డీఎం శ్రీనివాస్, సిబ్బంది తదితరులున్నారు.

ప్రకాశ్‌కు డాక్టరేట్ ప్రదానం

డిచ్‌పల్లి, జూలై 18: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో హిందీ విభాగంలో ప్రకాశ్‌కు డాక్టరేట్ వచ్చింది. రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ డా.ప్రవీణాబాయి పర్యవేక్షణలో శత్రుఘ్నకుమార్ విశ్లేషణాత్మక అధ్యాయన్ అనే అంశం పై పరిశోధన జరిపారు. గురువారం జరిగిన మౌలికపరీక్షకు ఎక్స్‌టర్నల్ ఎక్సామినర్‌గా (ఇఫ్లూ యూనివర్సిటీ) శ్యాంరావు రాథోడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పరిశోధకుడు ప్రకాశ్‌ను ఆయన పలుప్రశ్నలు అడిగి సమాధానలు రాబట్టారు. పరిశోధక విద్యార్థికి డాక్టరేట్ పట్టా ప్రకటించి అందజేశారు.

టీయూలో విద్యార్థినులకు పోటీలు

డిచ్‌పల్లి,జూలై 18 : తెలంగాణ విశ్వవిద్యాలయం బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో మెహిందీ, హెయిర్‌స్టైల్ పోటీలు గురువారం నిర్వహించారు. ఈ పోటీల్లో 40 మంది విద్యార్థినులు నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ ఈవెంట్‌లను ప్రొ.అంజనేయులు పర్యవేక్షించారు. పోటీల్లో జాదవ్ తేజకుమారీ, మాలవత్ లక్ష్మీ, మేఘశ్రీ, మేనేజర్‌గా వ్యవహరించారు. పోటీల్లో ప్రథమ బహుమతి సృజన, ఇస్రత్ నాజ్ జ్యోతియ బహుమతులు అందుకున్నారు. మెహిందీ పోటీల్లో శ్వేత, ప్రథమ, లావణ్య సెకండ్, భాగ్యశ్రీ మూడోబహుమతి అందుకున్నారు. అధ్యాపకులు రాజేశ్వరి, శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పీజీ సెమిస్టర్ పరీక్షల్లో 10మంది గైర్హాజర్

డిచ్‌పల్లి,జూలై 18: విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ ఇంటిగ్రేటెడ్ ఏపీఈ, ఐపీసీహెచ్, ఐఎంబీఏ 6,8,10వ సెమిస్టర్, ఎల్‌ఎల్‌బీ 6, ఎంబీఏ,ఎంసీఏ 1,3వ సెమిస్టర్, ఐఎంబీఏ 7,9 వసెమిస్టర్ రెగ్యూలర్, బ్యాక్‌లగ్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయని ప్రిన్సిపాల్ ప్రొ.హారతి, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణలు తెలిపారు.

ఆర్మూర్‌లో ఆశావర్కర్ల ధర్నా



కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఆశవర్కర్‌లు

ఆర్మూర్‌టౌన్, జూలై 18: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఐటీయు ఆధ్వర్యంలో గురువారం ఆశవర్కర్‌లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు మండల కన్వీనర్ కుతాడి ఎల్లయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశవర్కర్‌లకు రూ.18వేల వేతనం అందించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాణబీమా, రిటైర్‌మెంట్ బెనిఫిట్‌లను కల్పించాలని లేకుంటే సెప్టెంబర్ 25నుంచి అక్టోబర్ 9వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆశవర్కర్‌లు సమ్మె చేస్తారని ఆయన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆశవర్కర్‌ల ధర్నాకు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆశవర్కర్‌లు సలీమ, బాగ్య, వనిత, జ్యోతి, అనిత, స్వప్న, మమత, సరోజ, లాస్య, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం

ఏర్గట్ల, జులై 18 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్టీయూతోనే సాధ్యమని పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు ఉపాధ్యాయుల సమస్యలను ఒక పీఆర్టీయూ సాధించినవేనని తెలిపారు. కార్యక్రమంలో ఏర్గట్ల పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఆర్మూర్ డివిజన్ ఇన్‌చార్జి లక్ష్మణ్ పటేల్, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణప్రసాద్, మాజీ అధ్యక్షుడు శేర్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయల చంద్రశేఖర్ సంతాప సభ

నందిపేట, జులై 18 : మండల కేంద్రంలో గురువారం సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథ రాష్ట్ర కమిటీ నాయకులు, తెలంగాణ రాష్ట్ర అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చెర్మన్‌గా, సభ్యులుగా సుదీర్ఘకాలం పనిచేసినట్లు వక్తలు వివరించారు. విప్లవోద్యమ నిర్మాణం కోసం రాయల చంద్రశేఖర్ బహిరంగంగాను, రహస్యంగాను అనేక పనులు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) నాయకులు కె గంగాధర్, భూమన్న, రఫీక్, సలీమ్, సతీష్, నాగేష్ తదితరులు ఉన్నారు.

బోధన్‌రూరల్ : పేద ప్రజల కోసం నిరంతరం పోరాటం చేసిన కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ సేవలు మరువలేనివని సీపీఐ ఎంఎల్ నాయకులు మల్లేష్ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలో కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నిమిషం పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడురోజుల క్రితం రాష్ట్ర కమిటీ సమావేశానికి హాజరై ఇంటికి వెళ్తున్న సమయంలో రాయల చంద్రశేఖర్ ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందాడని పేర్కొన్నారు. ఆయన మరణం పార్టీకి ఎంతో తీరని లోటని పేర్కొన్నారు.

సంఘ భవన నిర్మాణానికి రూ.లక్షా 5వేల విరాళం

పెర్కిట్, జూలై 18 : మున్సిపల్ పరిధిలోని పద్మశాలి 2వ తర్ప సంఘ భవనానికి రూ.లక్ష 5111లను యుఎస్ఏ డల్లాస్‌కు చెందిన దాసరి నిర్మల రాధాకిషన్ కుమారుడు దాసరి ఉదయ్‌కిరణ్ విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్, కార్యదర్శి అంబల్ల వివేకానంద ఆధ్వర్యంలో గురువారం వారిని పూలమాల, శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు ఏడెల్లి శ్రీనివాస్, సుధాకర్, కన్నెపల్లి రాజన్న, లిప్టి అమర్, గుడ్ల దశరథ్, దేవయ్య, తాటిపాపల శ్రీనివాస్, బోగ రమణ, బండి రమేష్, బూస బాబు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చిన 61 వీఆర్ఏ వారసులు

ఎడపల్లి, జూలై 18 : మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి గురువారం 61 వీఆర్ఏల వారసులు తమకు ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. అలాగే జీ.ఓ.నం. 81ను అమలు చేయాలని ఆయనతో కోరగా, స్పందించిన ఆయన ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని వారికి హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో 61 వీఆర్ఏల వారసులు కరుణాకర్, రాజు, బాలు, మోహన్, రత్నాకర్, అవి నాష్, మహేందర్ తదితరులున్నారు.

గల్ఫ్ వెళ్లిన రైతులకు రుణమాఫీ అమలు చేయాలి

నవీపేట, జూలై 18 : ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లిన రైతులకు సైతం రుణమాఫీని అమలు చేయాలని మాజీ జడ్పీటీసీ కే.సాయిబాబా గౌడ్ కోరారు. గురువారం ఆయన నవీపేటలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో 2 లక్షల రూపాయల రుణమాఫీని అమలు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఇదే సమయంలో కొన్ని చోట్ల గల్ఫ్ వెళ్లిన రైతుల పేర్లు రేషన్‌కార్డులలో లేవని, ఇటువంటి రైతులను నోడల్ అధికారులు ప్రత్యేకంగా గుర్తించి వారికి రుణమాఫీ అమలు చేసే విధంగా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

ఆర్మూర్‌రూరల్, జూలై 18 : పంట రుణం తీసుకున్న ప్రతీ రైతుకు షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆర్మూర్ పట్టణంలో విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీవైస్‌చైర్మన్ ఇట్టెడి లింగారెడ్డి, మాక్లూర్ మాజీ వైస్ఎంపీపీ సుక్కిసుధాకర్, ఇ.గంగాధర్, సీనియర్ నాయకులు పోల సుధాకర్, పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్ మాట్లాడుతూ చిన్న, సన్న కారు రైతులు మాత్రం ఐటీ రిటర్స్ దాఖలు చేసినందున వారికి రుణమాఫీ వర్తించడం లేదన్నారు. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయాలన్నారు. అధికారం చేపట్టక మాటమార్చి అనేక షరతులు పెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదన్నారు. చిన్న, సన్నకారు రైతులకు తెల్లరేషన్ కార్డు ఉంటుందని, వివిధ కారణాల వల్ల కార్డు లేని వారికి రుణమాఫీ జరగడం లేదన్నారు. పట్టా పాస్‌పుస్తకం ఆధారంగా రుణాలు తీసుకున్న ప్రతీ ఒక్కరికి మాఫీ చేయాలని వారు కోరారు.

జాగ్రత్తలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చు

● ఎంవీఐ వివేకానందరెడ్డి

ఆర్మూర్ రూరల్, జూలై 18 : మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రతీఒక్కరు జాగ్రత్తలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఆర్మూర్ ఎంవీఐ వివేకానందరెడ్డి అన్నారు. గురువారం ఆర్మూర్ పట్టణంలో వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంవీఐ వివేకానందరెడ్డి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణం చేసేవారు సీట్‌బెల్ట్ తప్పక ధరించాలన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యానికి విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు అధిక శాతం ద్విచక్ర వాహనదారులు తలకు తీవ్రగాయాలై మృతిచెందుతున్నట్టు అధ్యాయనంలో వెల్లడైందని, ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరిస్తే కొంత వరకైనా కాపాడుకోవచ్చని సూచించా రు. ఇటీవల జిల్లాలో జరిగిన పలు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకపోవడం వల్లనే వాహనదారులు మృతిచెందినట్టుగా తాము గుర్తించామన్నారు. ప్రతీ ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సుంకె శ్రీనివాస్, వాహనదారులు పాల్గొన్నారు.

పొతంగల్‌లో ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోటగిరి, జూలై 18 : పొతంగల్ మండలంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. బుధవారం రాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

మోర్తాడ్, జూలై 18 : యువకులు, విద్యార్థులు గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై అనిల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ప్రైవేటు పాఠశాలలో గంజాయి ఇతర మత్తుపదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ యువకులు, విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసలుగా మారి తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి, మత్తుపదార్థాలు విక్రయించిన, సేవించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటగిరి: పొతంగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సందీప్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్‌లాంటి మత్తు పదార్థాల వల్ల భవిష్యత్ అంధకారం అవుతుందని పేర్కొన్నారు. వాటి వల్ల కలిగే నష్టాలను వివరించారు. విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, ప్రధానోపాధ్యాయులు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎస్సై సీహెచ్.తిరుపతి అన్నారు. గురువారం జక్రాన్‌పల్లిలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు డ్రగ్స్, గంజాయి, మత్తుపదార్థాలు నియంత్రణపై పోలీస్ కళాజాత నిర్వ హించా రు. నిజామాబాద్ పోలీసు కళాజాత బృందం సభ్యులు మత్తుపదార్థాలపై నాటికలు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై సుశీల్‌కుమార్, ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రెడ్డి, పోలీస్ కళాజాత బృందం, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.


పుస్తకాలను అందిస్తున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలి

కామారెడ్డి రూరల్, జూలై 18: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన వినయ్‌రెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా లైబ్రరీకి పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థికంగా స్థిరపడ్డ వారు పుట్టిన ఊరు, చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన వినయ్‌రెడ్డి రూ.లక్ష విలువ గల పుస్తకాలు, ఇతర సామగ్రి అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి వారిని ప్రోత్సహిస్తే భవిష్యత్తులో ఉత్సాహంగా సహాయం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిరెడ్డి, దాత చంద్రారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

సదాశివనగర్, జూలై 18: మండలంలోని ధర్మారావుపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు టై, బెల్టులను గురువారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి దాసరం సాయిబాబా ఉచితంగా 150మంది విద్యార్థులకు టై, బెల్ట్, ఐడెంటిటీ కార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో యోసఫ్, ప్రధానోపాధ్యాయుడు సదాశివ్, బలరాం, రామాంజనేయులు, మధుక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

'బంజారాల అభ్యున్నతికి

రాంరావు మహరాజ్ విశేష కృషి'

బాన్సువాడ టౌన్, జూలై 18: బంజారాల అభ్యున్నతికి రాంరావు మహరాజ్ విశేషమైన కృషి చేశారని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రతాప్‌సింగ్ రాథోడ్ అన్నారు. గురువారం ఆయన బాన్సువాడ పట్టణంలో రాంరావు మహరాజ్ జయంతి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 21న ప్రతీ తండాలో ప్రతీ బంజారా బిడ్డ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఈనెల 31న హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బంజారా నాయకులు చందర్ నాయక్, అంబర్‌సింగ్, రవిచవాన్, బోడ తార్య, ధన్సింగ్, నారాయణ తదితరులున్నారు.


సంఘ సభ్యత్వ నమోదు చేస్తున్న దృశ్యం

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం

నసురుల్లాబాద్, జూలై 18: మండల కేంద్రంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు గునిగిరి హన్మాండ్లు ఆధ్వర్యంలో, పీఆర్‌టీయూ యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుశాల్ మాట్లాడుతూ పీఆర్‌టీయూ సభ్యత్వం ఒక వరం లాంటిదని, ఉపాధ్యాయుల సమస్యల సాధనలో పీఆర్‌టీయూ యూనియన్ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పీఆర్‌టీయూ అధ్యక్షులు గునిగేరి హన్మాండ్లు, రాష్ట్ర బాధ్యులు వెంకగౌడ్,చ ఉపాధ్యాయులు వెంకాగౌడ్, హన్మాండ్లు, శ్రీనివాస్, సుజాత, శ్రీచంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

భిక్కనూరు, జూలై 18: తెలంగాణ వ్యాప్తంగా 60లక్షలకు పైగా జనాభా ఉన్న ముదిరాజులకు ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1000కోట్ల నిధులు మంజూరు చేయాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పున్న రాజేశ్వర్, జిల్లా అధ్యక్షుడు భిక్షపతి అన్నారు. గురువారం భిక్కనూరులో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ముదిరాజులను బీసీడీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని, జీవోఎంఎస్ నెంబర్ 15ను వెంటనే అమలు చేయాలని అన్నారు. చెరువులు, కుంటలపై ముదిరాజు, బెస్తలకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ చట్టం తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు బండి రాములు, రవీందర్, భూమయ్య, రమేష్, లక్ష్మీ, నర్సింలు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

దోమకొండ, జూలై 18: మండల కేంద్రంలోని దోమకొండ గడి కోట, గ్రామ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆనంద్ భవన్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్డియాలజిస్ట్ సలీం, వైద్యులు నిషిత, నిహారికలు ఉచితంగా వైద్య సేవలు నిర్వహించి మందులు అవసరమైన వారికి అందజేశారు. 187 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కోట మేనేజర్ బాబ్జి, గణేష్ యాదవ్, ఆపోలో ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో రైతు రుణమాఫీపై సంబరాలు

పెద్ద కొడప్‌గల్, జూలై 18: ఎన్నికల హామీలో ఇచ్చిన విధంగా అర్హులైన రైతులకు మొదటి విడత కింద ప్రభుత్వం రూ.1లక్ష రుణమాఫీ చేయడాన్ని స్వాగతిస్తూ జుక్కల్, పెద్ద కొడప్‌గల్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో రైతులు సంబరాలు జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో రైతులతో పాటు, కాంగ్రెస్ నాయకులు పాల్గొని రేవంత్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జుక్కల్ మండల కేంద్రంలో రైతులతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొని రేవంత్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జుక్కల్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ చేయడం సంతోషించదగిన విషయమన్నారు.

బీర్కూర్: బీర్కూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాసుల బాల్‌రాజ్ చిత్ర పటాలకు రైతులు, నాయకులు క్షీరాభిషేకం చేశారు.

మద్నూర్: డోంగ్లి మండలం లింబూర్ గ్రామంలోని రైతు వేదికలో రైతు రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు రైతులతో కలిసి పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు రైతులు, గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయడం అనేది దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించ దగ్గ అంశమని కొనియాడారు. రైతన్నల రుణమాఫీ సంబురాలతో రాష్ట్రమంతా పండుగ వాతావరణం సంతరించుకుందన్నారు. ఈ కార్యక్రమంలో డోంగ్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బసవరాజు పటేల్, డోంగ్లి మాజీ సింగిల్ విండో చైర్మన్ శివాజీ పటేల్, పురుషోత్తం పటేల్, గజానంద్ దేశాయి తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్: రుణమాఫీతో రైతుల గుండెల్లో రేవంత్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతాడని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మర్రి సదాశివరెడ్డి అన్నారు. రుణమాఫీని అడ్లూర్ ఎల్లారెడ్డి రైతువేదిక ద్వారా వీడియో కాన్ఫరెన్స్‌లో వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతు పక్షాన నిలుస్తుందని గతంలో రైతులకు వ్యవసాయ పనిముట్లు బిందుసేద్యం, తుంపర సేద్యం లాంటి ఎన్నో పథకాలను కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రజాపతి, ఏఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఇర్షాద్, రాజేందర్, రాంరెడ్డి, రూపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీబీపేట: మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు సుతారి రమేష్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరైతులకు రుణవిముక్తి కలిగించాలనే ఉద్దేశ్యంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.1లక్షలోపు మాఫీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భూమాగౌడ్, శ్రీహరి, వెంకట్‌గౌడ్, నర్సింలు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు రుణమాఫీ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని మండల రైతులు వీక్షించారు. అనంతరం లబ్ధిదారులు సంబరాలు నిర్వహించారు. రైతులు ఒకరినొకరు స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఏడీఈ కిరణ్ చైతన్య, ఏఈ ప్రదీప్, ఏవో పవన్ కుమార్, విండో చైర్మన్ నాగరాజురెడ్డి, సీఈవో బాల్‌రెడ్డి, ఏఈవోలు శ్రీలత, క్రిష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట: మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావుల చిత్ర పటాలకు కాంగ్రెస్ నాయకులు, రైతులు కలిసి క్షీరాభిషేకం చేశారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజ్‌దాస్, మండల కాంగ్రెస్ నాయకులు విఠల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, ఇమామ్, బాల్‌రెడ్డి, ఏవో విజయ్ శేఖర్, వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు ప్రభుత్వం అని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిలో తహసీల్దార్ కార్యాలయం ముందు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. బాణసంచా కాల్చి రైతులకు మిఠాయిలు పంచి రుణమాఫీ పండుగను నిర్వహించారు. అనంతరం ఎల్లారెడ్డి మండలం మీసన్‌పల్లి రైతు వేదికలో ముఖ్యమంత్రితో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని రుణమాఫీ నిధుల విడుదల చేసిన మదన్ మోహన్ మీడియాతో మాట్లాడారు. జిల్లాలో అత్యధికంగా మన నియోజకవర్గంలోనే 17,231 మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, నాయకులు చిన్న లక్ష్మణ్, చింతల శంకర్, ఈశ్వర్‌గౌడ్, ప్రశాంత్‌గౌడ్, నియోజకవర్గ రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పెద్దకొడప్‌గల్‌లో సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


బీర్కూర్‌లో..


బీబీపేటలో..


సదాశివనగర్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

బాన్సువాడ రూరల్, జూలై 18: ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎమ్మెల్యే ఇంటికి ఆశా వర్కర్లు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ. ఐదు లక్షలు వర్తింపజేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నన్నేసాబ్, విజయ, శోభ, సుమలత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కొడప్‌గల్: రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో ఆశ కార్యకర్తలకు ఇచ్చిన విధంగా హామీలు నెరవేర్చాలని జిల్లా సీఐటీయూ కార్యవర్గ సభ్యులు సురేష్‌గొండ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడిలో భాగంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో జుక్కల్ నియోజక వర్గంలోని వివిధ మండలాలకు చెందిన ఆశ కార్యకర్తలు ఆందోళన చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన సురేష్ గొండ మాట్లాడుతూ ఆశ కార్యకర్తలను సుప్రీం కోర్టు తీర్పుమేరకు 26 వేలు కనీస వేతనం చెల్లించాలని, ప్రతీ ఆశ కార్యకర్తకు ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశలకు నష్టం కలిగించే పరీక్షలు పెట్టే విధానాన్ని ఉప సంహరించుకోవాలని, గతంలో ఇచ్చినట్లుగా పారితోషకాలు 2వ తేదీన చెల్లించాలని కోరారు. 2021 జూలై నుంచి డిసెంబరు వరకు 6 నెలల పీఆర్‌సీ ఎరియర్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తలకు 50లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. పనిభారం తగ్గించి జాబ్ చార్ట్ ఇవ్వాలని, రిటర్మెంట్ బెనిఫిట్స్ 5 లక్షలు, పదవీ విరమణ అనంతరం పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తలకు సంబంధించిన 24 రకాల న్యాయపరమైన కోరికలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం జుక్కల్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పుష్ప గౌడ్, నాగమణి, లలిత, విజయ, సుమ, గంగమణి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: తమకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ ఉద్యోగ భద్రత క్పించాలని ఆశా వర్కర్లు గురువారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు వర్తింపజేయాలని కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.


పెద్దకొడప్‌గల్‌లో ఆందోళన చేస్తున్న ఆశ కార్యర్తలు


ఎల్లారెడ్డి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు


బాన్సువాడ ఏరియా ఆసుపత్రిలో బోనాల పండుగలో బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే పోచారం, ఆగ్రోస్ చైర్మన్ కాసుల

మాతా శిశు ఆసుపత్రిలో ఘనంగా బోనాల పండుగ

బాన్సువాడ, జూలై 18 : బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ మాతా శిశు సంరక్షణ ఆసుపత్రిలో ఆషాడ మాసం సందర్భంగా మైసమ్మ ఆలయంలో అమ్మవారికి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి రాష్ట్ర ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్‌లు పాల్గొని బోనమెత్తుకుని ర్యాలీగా అమ్మవారి ఆలయానికి వెళ్లి బోనాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేపట్టారు. వర్షాలు సక్రమంగా కురవాలని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కుకున్నట్లు వారు తెలిపారు. ప్రతి సంవత్సరం అనవాయితీ ప్రకారం అమ్మవారికి బోనాలు సమర్పించడం జరుగుతుందని అందులో భాగంగా ఈ సంవత్సరం కూడా బోనాల పండుగను నిర్వహించామన్నారు.

బాధితుడికి ఫోన్ అందజేసిన ఎస్సై

పెద్ద కొడప్‌గల్, జూలై 18: గత 20 రోజుల కింద ఫోన్ పోగొట్టుకున్న బాధితుడికి జుక్కల్ ఎస్ఐ సత్యనారాయణ ఫోన్‌ను అందజేశారు. జుక్కల్ మండలంలోని నాగల్‌గాం గ్రామానికి చెందిన ఒడ్డె సాయిలు గత 20 రోజుల కిందట నాగల్‌గాం నుంచి జుక్కల్ వస్తుండగా తన ఫోన్ పోగొట్టుకున్నామని ఫిర్యాదు చేయగా, సీఈఐఆర్ సిస్టం విధానం ద్వారా ఫోన్ ఆచూకీ కనుగొని బాధితుడికి అందజేశామని తెలిపారు.

భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద బైక్ చోరీ

భిక్కనూరు, జూలై 18: మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై గల టోల్‌ప్లాజా వద్ద బైక్ చోరీ జరిగినట్లు ఎస్ఐ సాయికుమార్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన యాదగిరి ఆర్టీసీలో నిజామాబాద్ డిపోలో పని చేస్తున్నాడని ఎప్పటిలాగే తన బైకును టోల్‌ప్లాజా వద్ద పార్క్ చేసి డ్యూటీకి వెళ్లగా తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించలేదని తెలిపారు. దీంతో యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విఠలేశ్వర ఆలయంలో అన్నదానం

బీర్కూర్, జూలై 18: మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయ సన్నిధిలో గురువారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం భక్తులు కఠినమైన ఉపవాస దీక్షలు ఆచరించారు. ఈ మేరకు గురువారం విఠలేశ్వర ఆలయ సన్నిధిలో మున్నూరు కాపు యువకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేకల గాలయ్య, గంధ్యాటం గంగాధర్, ఆరిగే ధర్మతేజ, కాసుల గజేందర్, కుర్రి కృష్ణ, మున్నూరు కాపు యువకులు, భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో వీధి కుక్కల స్వైర విహారం

- భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు
- అధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకోలు

బాన్సువాడ టౌన్, జూలై 18 : బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వార్డుల్లో గల కాలనీలో గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. చిన్న పిల్లలు బయట కనబడితే వారిపై దాడి చేస్తున్నాయి. పగలు, రాత్రి వేళలో కాలనీల్లో తిరగడం వల్ల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పాఠశాలలకు వెళ్లే చిన్నారులు బయట కుక్కలు కనిపిస్తే జంకాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రి వేళలో ద్విచక్ర వాహనాల వెంటబడుతున్నాయి.

రెండు రోజుల్లో మొక్కలు నాటడం పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

పెద్ద కొడప్‌గల్, జూలై 18: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన మొక్కలు నాటడం రెండు రోజుల్లో పూర్తి చేయాలని జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్ సిబ్బందికి సూచించారు. ఎంపీడీవో కార్యాలయలో ఉపాధిహామి, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశానికి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపట్టిన హోంస్టీడ్ కార్యక్రమాన్ని రెండు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. దీంతో పాటుగానే ఆయా గ్రామాల ప్రజలు వ్యక్తిగతంగా ఇంకుడు గుంతలు నిర్మించాలనుకుండే ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించుకోవాలని తెలిపారు. ఇక ప్రస్తుతం వర్షాకాలం అయినందున గ్రామాలలో పారిశుద్యం మెరుగు పర్చడానికి గాను అన్ని రకాల చర్యలు తీసుకోవాలని పంచాయితీ కార్యదర్శులకు సూచించారు.దోమల బెడద నివారణగాను నీటి గుంతలలో ఆయిల్‌బాల్స్ వేసి నివారించాలని సూచించారు. డ్రైనేజీ నిర్వహణ మెరుగు పర్చి, వ్యాధులు రాకుండ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపివో నాగరాజ్, ఏపివో తులసీరాం, ఈసి స్వామిదాస్, పంచాయితీ కార్యదర్శులు, ఉపాధి హామి పీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఈత మొక్కలను నాటిన ఎక్సైజ్ అధికారులు

బీబీపేట, జూలై 18: బీబీపేట మండలంలోని మందాపూర్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వన మహోత్సవంలో భాగంగా ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావు గౌడ కులస్తులతో కలిసి 300ఈత మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కల్లుగీతను ప్రధాన జీవనధారంగా బతికే గౌడ కులస్తుల అభివృద్ధి కోసం గ్రామీణ ప్రజలకు కల్తీ లేని కల్లు అందించడం కోసం ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ఈత మొక్కలను నాటుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు నారాగౌడ్, నాగరాజుగౌడ్, కిష్టాగౌడ్, వెంకట్‌గౌడ్, సాయికుమార్‌గౌడ్, దయానంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండలంలోని ముత్యంపేట గ్రామంలో గురువారం అబ్కారీ సీఐ మధుసూదన్‌రావు గౌడ సంఘం సభ్యులు, సిబ్బందితో కలసి ఈత మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ముత్యంపేట గౌడ కమ్యూనిటీ భూమిలో 400 మొక్కలు, కొమటికుంట చెరువు కట్ట మాందాపూర్‌లో 300, ఇస్సానగర్‌లో 300 మొక్కలు మొత్తం 1000 ఈత మొక్కలు నాటడం జరిగిందని సీఐ తెలిపారు. కార్యక్రమంలో అబ్కారీ సిబ్బంది జీవన్, స్వాతి,అపూర్వ, పావని, శ్రీనివాస్, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎల్లారెడ్డి, జూలై 18: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన ఎల్లారెడ్డిలో చోటు చేసుకుంది. ఎల్లారెడ్డి ఎస్ఐ బొజ్జ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డికి చెందిన ఎం.ఎ. అజీజ్ బుధవారం వ్యక్తి గత పని నిమిత్తం ఎల్లారెడ్డి నుంచి లక్ష్మాపూర్ గ్రామానికి వెళ్లి తిరిగి లక్ష్మాపూర్ గ్రామం నుంచి ఎల్లారెడ్డికి వస్తుండగా హాజీపూర్ తండా కాలువ వద్ద గల మూలమలుపు వద్ద ఎదురుగా ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి వైపు వస్తున్న ఒక మినీ ట్రాలీ ఆటో వాహనం అతివేగంగా నిర్లక్ష్యంగా ఎదురుగా వచ్చి అజీజ్ ప్రయాణిస్తున్న బైక్‌కి ఢీకొట్టగా అజీజ్ కింద పడటంతో అతని తలకు, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు అజీజ్‌ను హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. ఈ విషయమై అతని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	ఓసీ
దర్శన్	భారతీయుడు-2
ప్రియా 70	కల్కి
ప్రియా 35	భారతీయుడు-2

బాన్సువాడ	
మహేశ్వరి	కల్కి
వెంకటేశ్వర	డార్లింగ్

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	160	200	220
వెన్‌కాబ్(కిలో)	170	220	230

